క్లుప్తంగా

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు మార్చి 2న ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డయాబెటాలజిస్ట్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వలైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే వైద్య శిబిరంలో ఒక్కో రోగికి సుమారు రూ.10 వేల ఖరీదు చేసే ఫైబ్రో స్కాన్ ఉచితంగా చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పేదలు ఉపయోగించుకోవాలని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకునేవారు ముందుగా 8341713713, 9854757999 నంబర్లను సంప్రదించాలన్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానం పెంచుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంచుకుని నూతన ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అంతరిక్ష శాస్త్రవేత్త చందు సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వైజ్ఞానిక మోడల్స్‌ను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చందు సాంబశివరావు వర్కింగ్ మోడల్స్‌ను తిలకించి, విద్యార్థులను అభినందించారు. పాఠశాల కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్‌ఎం ఉషశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



పాతగుంటూరు: అరండల్ పేట నాలుగో లైనులోని అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణ స్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రధానాచార్యుడు మర్రిపాటి ప్రసాద్ బృందం ఆధ్వర్యంలో ఉదయం శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద మంత్రాల నడుమ కనుల పండువగా ఆదిలక్ష్మీ నారాయణుల కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, రక్షాధారణ, నవగ్రహారాధన, మాంగళ్య పూజ వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

ధర్మమే సృష్టికి ఆధారం



పాతగుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై సుందర సత్సంగ్, ఆలయ పాలకమండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విష్ణు సహస్రనామంపై సుందరచైతన్యానంద స్వామి శిష్యుడు కేవీ కోటేశ్వరరావు ప్రవచనం చేశారు. పరమాత్మ సర్వజగత్తును సృష్టించి ధర్మం ప్రతిష్ట చేశారని, లోకంలోని జనులు ధర్మాత్ములనే ఆశ్రయిస్తున్నారన్నారు. సూర్య చంద్రులు కూడా గతి తప్పకుండా ధర్మాన్ననుసరించే ప్రకాశిస్తున్నాయన్నారు. అన్నింటికన్నా ధర్మమే శ్రేష్టమని చెప్పారు. అనంతరం ఆలయ పాలకమండలి సభ్యులు కె.వి.కోటేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో ప్రసన్నకుమార్, సాంబశివరావు, శివారెడ్డి, ఆర్.వి. బసవేశ్వరరావు, ఆలయ ఉపాధ్యక్షుడు విజయబాబు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు



పాతగుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 24వ వార్షిక బ్రహ్మోత్సవాలు 2వ తేదీ నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య తెలిపారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2న విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. 3న శేషవాహన సేవ, ప్రధాన ప్రాకార గోపుర దివ్య కలశ ప్రతిష్టా మహోత్సవం, ద్వారపాలక, గరుడాళ్వార్, ఆంజనేయ శిలా విగ్రహ ప్రతిష్ఠ, 4న హనుమత్ వాహనసేవ, 5న గజవాహన సేవ స్వామివారి ఊరేగింపు విశేషంగా జరుగుతాయని అన్నారు. కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు పద్మావతి కళావేదికపై పారాయణాలు, తాళం భజనలు, సువాసినీపూజ, చండీహోమం, 7న అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు మాధవస్వామి, ఆలయ ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సంయుక్త కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొన్నారు.



తెనాలిలో జరిగిన రైతుభరోసా సభకు హాజరైన సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఐజీ త్రివిక్రమ్ వర్మ



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



సీఎం వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా

అసంపూర్తి పనులతో తిప్పలు



ఇంకా తెరుచుకోని సంజీవయ్యనగర్ రైల్వేగేటు



అరండల్‌పేటలో వాల్వ్ నుంచి వృథాగా పోతున్న నీరు

నెహ్రూనగర్: నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం(హెచ్‌ఎల్‌ఆర్) వాటర్ ట్యాంకులకు 900 ఎంఎం డయా పైపులైన్‌కు అనుసంధాన పనుల నిమిత్తం ఫిబ్రవరి 21 సాయంత్రం నుంచి సంజీవయ్యనగర్ రైల్వే గేటును ఇంజినీరింగ్ అధికారులు మూసివేయించారు. అనుసంధాన పనులు 22 నాటికి ప్రారంభించి 24 నాటికి పూర్తి చేసి గేటు తీస్తామని రైల్వేగేటు వద్ద నోటీసు అందించారు. అయితే ఇప్పటివరకు ఇంకా గేటు తీయకపోవడంతో నెహ్రూనగర్ నుంచి సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, రెడ్డిపాలెం వెళ్లే వారు చుట్టూ తిరిగి డొంక రోడ్డు మీదుగా రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైల్వే గేటు తెరవడానికి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ వాల్వ్ నుంచి నీరు వృథా..

అరండల్‌పేట 4వ లైను(మెయిన్‌రోడ్డు) శ్రీ హాస్పటల్ దాటిన తరువాత వాటర్ వాల్వ్ నుంచి నీరు వృథాగా పోయింది. నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి లక్ష్మీపురం వాటర్ ట్యాంకులకు నీరు సరఫరా చేసేందుకు ఇటీవల కాలంలో 800 ఎంఎం డయా పైపులైన్ నుంచి 900 ఎంఎం డయా పైపులైన్‌కు అనుసంధానం చేశారు. అయితే 900 ఎంఎం డయా పైపులైన్ గత రెండేళ్ల క్రితం వేసింది కావడంతో పైపులైన్లలో పేరుకుపోయిన మట్టిని తొలగించేందుకు వాల్వ్‌ను నుంచి నీటిని బయటకు వదలడం జరిగిందని ఇంజినీరింగ్ అధికారులు తెలియజేశారు.

జన్యుమార్పిడి పంటలతో నష్టం

లాం ఫామ్ సీనియర్ శాస్త్రవేత్త జీఎంవీ ప్రసాదరావు



గుంటూరు ఎడ్యుకేషన్: జన్యుమార్పిడి పంటలతో పర్యావరణ సమతుల్యతకు నష్టమని లాం ఫామ్ సీనియర్ శాస్త్రవేత్త జీఎంవీ ప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాదరావు జన్యుమార్పిడి పంటలతో కలిగే నష్టాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు టీఆర్ రమేష్, డాక్టర్ కొల్లా రాజమోహన్, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హిందూ కళాశాలలో...

మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో సైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ ఫలాతాన్ని గురించి విద్యార్థులకు వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నిత్య జీవితంలో సైన్స్ ప్రాధాన్యత, దేశాభివృద్ధికి సైన్స్ ఏ విధంగా దోహదపడుతుందో తెలిపారు. సైన్స్ అసోసియేషన్ కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవి మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చెరువు రామకృష్ణమూర్తి, బోటనీ పీజీ ఇన్‌చార్జి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, కె.కాళిదాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి ముందు నిలిపిన కారు దగ్ధం

గుంటూరు రూరల్: ఇంటి ముందు నిలిపిన కారును గుర్తుతెలియని వ్యక్తులు దగ్ధం చేసిన ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. గోరంట్ల సున్నపుబట్టీల సెంటర్‌లో మన్నెం లక్ష్మి, భర్త శ్రీనివాసరావు నివాసం ఉంటున్నారు. సోమవారం రాత్రి తన కారును ఇంటి ముందు పార్క్ చేసి ఇంట్లో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత రోడ్డుపై వెళుతున్న వాహనదారులు కేకలు వేయడంతో లేచి చూడగా కారు దహనమవుతుండటం గమనించి మంటలు ఆర్పే సమయంలో లక్ష్మికి స్వల్పగాయాలు అయ్యాయి. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నూతన ఆవిష్కరణలతో భావి శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: నూతన ఆవిష్కరణలతో భావి శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం లభిస్తుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. పాత గుంటూరులోని కన్న ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కన్న మాస్టారుతో కలిసి సర్ సీవీ రామన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. ఆయన మాట్లాడుతూ అగ్ర భారతదేశ నిర్మాణంలో భావి పౌరులైన విద్యార్థులు నోబెల్ బహుమతి గ్రహీత సర్ సీవీ రామన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ మూడు రోజుల పాటు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను వేలాది మంది సందర్శించారని తెలిపారు. విద్యార్థుల్లో విజ్ఞానాభివృద్ధికి దోహదం చేసే విధంగా ప్రదర్శన ప్రయోజనం చేకూర్చిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె. శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుమేధ హైస్కూల్‌లో...

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీఓ కాలనీలోని సుమేధ హైస్కూల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులతో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యాసంవత్సరం పొడవునా విద్యార్థులు సబ్జెక్టుల వారీగా నేర్చుకున్న అంశాలను ప్రాజెక్టులు, చార్టులు, మోడల్స్ రూపంలో ప్రదర్శించారని తెలిపారు. ప్రదర్శన తిలకించిన లీడ్ కంపెనీ ప్రతినిధులు ప్రశాంత్, సంతోష్ విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కన్న స్కూల్లో సీవీ రామన్ చిత్రపటం వద్ద ఎమ్మెల్సీ లక్ష్మణరావు, కన్న మాస్టారు

స్టెమ్ స్కూల్‌లో...

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ ఉపాధ్యక్షుడు కె. రవీంద్రకుమార్, కెమిస్ట్రీ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి మన్నం కృష్ణమూర్తి, ఐఏపీటీ ఈసీ సభ్యుడు లక్ష్మణ్ సూరి పాల్గొని విద్యార్థులకు ప్రయోగాత్మక ప్రదర్శనలతో సైన్స్‌పై అవగాహన ఆసక్తి కలిగించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్-కరస్పాండెంట్ ఫాదర్ భరత్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన విద్యార్థులు 70 రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారని తెలిపారు. సైన్స్ ఆవశ్యకతను వివరించారన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దిలీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో...

గుంటూరు ఎడ్యుకేషన్: విజ్ఞానశాస్త్రం జీవన ప్రగతికి సోపానమని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సైన్స్ మానవ జీవితంలో అంతర్భాగమని, విద్యార్థులు సైన్సుపై మక్కువ పెంచుకుని దేశాభివృద్ధికి దోహదపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు సందర్శకులకు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశ్రాంత కెమిస్ట్రీ అధ్యాపకుడు శాఖమూరి శివ రాంబాబు, ప్రిన్సిపాల్ వై. రథినీచౌదరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సుమేధ హైస్కూల్లో సోలార్ సిస్టమ్‌తో విద్యార్థులు



స్టెమ్ స్కూల్లో సీవీ రామన్ చిత్రపటం వద్ద ఫాదర్ భరత్, దిలీప్, విద్యార్థులు



కేఎల్‌పీ స్కూల్లో సీవీ రామన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులతో కృష్ణప్రసాద్, రథినీ చౌదరి

కిడ్నీ ఆపరేషన్‌లలో రికార్డు సృష్టించిన డాక్టర్ ప్రకాశరావు



డాక్టర్ ప్రకాశరావును సన్మానిస్తున్న దృశ్యం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ యూరాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ బూసం ప్రకాశరావు కిడ్నీ మార్పిడి ఆపరేషన్‌ల ప్రక్రియలో అరుదైన రికార్డు సృష్టించి జీజీహెచ్ ప్రతిష్టను పెంచారని పలువురు వైద్యులు కొనియాడారు. డాక్టర్ ప్రకాశరావు ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం యూరాలజీ వైద్య విభాగంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. జీజీహెచ్‌లో సుమారు 25 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయడంతోపాటు, అత్యాధునిక వైద్య పరికరాలను, పీజీ సీట్లను వైద్య విభాగానికి మంజూరయ్యేలా కృషి చేసిన డాక్టర్ ప్రకాశరావు యూరాలజీ వైద్య విభాగ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మశ్రీ, గుంటూరు వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకళ, సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, సీనియర్ యూరాలజిస్టు డాక్టర్ కె.ఎస్.చారి, డాక్టర్ మండవ శ్రీనివాసరావు, డాక్టర్ మాధవరావు, యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోహర్, పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సిబ్బంది, పీజీ వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, క్లాస్-4 ఉద్యోగులు సన్మాన కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ ప్రకాశరావు సేవలను కొనియాడారు.

తనబుద్దు కృష్ణారెడ్డికి ఘన నివాళి



కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే సుచరిత

గుంటూరు రూరల్: ప్రజా సమస్యల కోసం నిత్యం కృషి చేసే మంచి మనసున్న నాయకుడు తనబుద్దు కృష్ణారెడ్డి అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. కార్పొరేటర్ తనబుద్దు కృష్ణారెడ్డి దశదిన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, దయాసాగర్ దంపతులు, ఎమ్మెల్సీలు అభ్యర్థులు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణ, వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి మోదుగుల వేణుగోపాలరెడ్డి, కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు తాడిశెట్టి మురళి, డెప్యూటీ మేయర్‌లు షేక్ సజీల, డైమండ్‌బాబు ఉన్నారు.

ఉద్యోగాలకు 287 మంది విద్యార్థినులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ జ్యోత్స్న కుమారి, అపర్ణ సీతారామ్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలోని జవహర్ విజ్ఞాన కేంద్రం (జేకేసీ) ఆధ్వర్యంలో రేణిగుంటకు చెందిన డిక్సన్ ఇండియా ఎలక్ట్రిక్ ప్రైవేటు లిమిటెడ్ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 287 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వివిధ కళాశాలల నుంచి హాజరైన 374 మంది విద్యార్థినులకు మౌఖిక పరీక్ష అనంతరం 287 మందిని ఎలక్ట్రానిక్ కేబుల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆపరేటర్ అండ్ అసిస్టెంట్ లైన్ లీడర్ ఉద్యోగానికి ఎంపిక చేశారు. ఈసందర్భంగా విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి అభినందించారు. ఇంటర్వ్యూ ప్రక్రియలో డిక్సన్ కంపెనీ ప్రతినిధి దొరబాబు, జేకేసీ సమన్వయకర్త కె.అపర్ణ సీతారామ్, మెంటార్లు యూనిస్ ఖాన్, అపర్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీజీహెచ్ యూరాలజీ వైద్య విభాగాధిపతిగా డాక్టర్ మనోహర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ యూరాలజీ వైద్య విభాగాధిపతిగా డాక్టర్ జి.మనోహర్ నియమితులయ్యారు. విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రకాశరావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. దీంతో డాక్టర్ మనోహర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చాగంటి పద్మావతి ఉత్తర్వులు జారీ చేశారు. యూరాలజీ వైద్య విభాగాధిపతిగా విధుల్లో చేరిన డాక్టర్ మనోహర్‌ను పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

రాత్రి 8గంటల వరకు పనిచేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్నులు చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరాభివృద్ధికి పన్ను చెల్లింపు కీలకమని, ప్రతి ఒక్కరూ పన్ను బకాయిలు సకాలంలో చెల్లించాలన్నారు. పన్ను చెల్లింపునకు వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్ లోని 106 సచివాలయాల్లో కూడా ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. నగరపాలక సంస్థ సచివాలయ కార్యదర్శులు పన్ను బకాయిదార్లకు పన్ను చెల్లింపుపై ఇప్పటికే సమాచారం తెలిపారని, పన్ను చెల్లించని బకాయిదార్లకు నీటి కుళాయిలు, అత్యవసర సేవల నిలుపుదల నోటీసులు, ఆర్.ఆర్. యాక్ట్ అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగునీరు సరఫరా చేయాలి

గుంటూరు రూరల్: నగరంలో పలు ప్రాంతాల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో తమకు తాగునీరు అందటంలేదని 40వ డివిజన్ రత్నగిరినగర్ వాసులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో అధికారులు స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని నగరంలో పలు ప్రాంతాల్లో ప్రజలకోసమే తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని అప్పటి వరకూ లారీలు ఇతర సాధనాలతో నీటి ఇబ్బందులు తీరుస్తామని చెప్పటంతో ఆందోళన విరమించారు.

దంత వైద్య శిబిరం

చేబ్రోలు: దంత సమస్యలపై విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కేర్ డెంటల్ కళాశాల, హాస్పిటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. చేబ్రోలులోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని 164 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు.